## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. అత్తాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. మదీనా, ఖిల్వత్, చార్మినార్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. దూద్‌బౌలి, రూప్‌లాల్‌బజార్, హైకోర్టు ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

**ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..**

విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. సీఆర్‌పీఎఫ్, కేశవగిరి, సుల్తాన్‌షాహీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు. షాజహాన్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

### మురళీమోహన్‌కు పురస్కారం



మురళీమోహన్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న జస్టిస్ భవాని ప్రసాద్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్ తెలుగు ప్రజల గుండెల్లో తనకంటూ మంచి గుర్తింపును తెచ్చుకున్నారని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవాని ప్రసాద్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావు నిర్వహణలో యువకళావాహిణి ఆధ్వర్యంలో సినీనటుడు మురళీమోహన్ చలనచిత్ర స్వర్ణమహోత్సవాన్ని పురస్కరించుకుని ఆయనకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నటుడిగానే కాకుండా పారిశ్రామికవేత్త, దర్శక నిర్మాతగా అనేక సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నర్సింహరావు, సంగీత దర్శకుడు రాధాకృష్ణన్, యువకళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

సుల్తాన్‌బజార్: ఆర్‌కే కళా సంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు ఆదివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాకారులు పార్వతి అక్షయ నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం కళాకారులకు ఆర్‌కే కళా సాంస్కృతిక ఫౌండేషన్ వారు మెమొంటోలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున సాహితీ ప్రియులు పాల్గొన్నారు.


### శ్రీనివాసాచార్యులకి నంది అవార్డు



నంది అవార్డు అందుకుంటున్న ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు నల్లదీగల శ్రీనివాసాచార్యులుకు ఉత్తమ అర్చకులుగా నంది అవార్డును అందుకున్నారు. భాగ్యనగరంలోని ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఆర్కె కళా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసాచార్యులుకు బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ నంది అవార్డు ప్రదానం చేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

### యోగాతో ఆరోగ్యం పదిలం



శోభాను సత్కరిస్తున్న యోగా గురువు సత్యనారాయణ, మెట్టు వెంకటేష్ తదితరులు

అబిడ్స్: యోగాతో మానవాళి ఆరోగ్యం సుభిక్షంగా ఉంటుందని భారతీయ యోగా సంస్థాన్ యోగా గురువు సత్యనారాయణ పేర్కొన్నారు. యెగా సభ్యురాలు శోభా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమెను సత్కరించి అందరూ సభ్యులంతా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యోగా గురువు సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ కొంతసేపు అయినా ప్రతిరోజూ యోగాసనాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లత, రామారావు, సరోజ, మహేష్ తివారి, రాధా పాల్గొన్నారు.

# వారమైనా ఏం తేలలే..!



- వారం గడిచినా సస్పెన్స్‌గానే జియాగూడ దారుణ హత్య ఘటన
- భయం గుప్పిట్లో ఆ ప్రాంత ప్రజలు
- ఎటూ తేల్చని కుల్సుంపురా పోలీసులు

జియాగూడ: జియాగూడలో దారుణ హత్య జరిగి వారం రోజులు గడిచింది. హత్యకు గల కారణాలు నేటికీ బయటపడలేదు. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నా కారణాలు బయటకు రాకపోవడంతో హతుడి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన జియాగూడ జాతీయ రహదారిలో జరిగిన దారుణ హత్యలో ముగ్గురు నిందితులు జియాగూడకు చెందిన వారే కావడం గమనార్హం. గతంలో జరిగిన హత్యల ఘటనలు తలుచుకుంటూ బస్తీల్లో ప్రజలు భయాందోనకు గురవుతున్నారు. రాత్రైతే బస్తీల్లో కర్ఫ్యూను తలపిస్తోంది. 15 ఏళ్ల క్రితం జియాగూడలో హత్యల పరంపర కొనసాగడం వల్ల బస్తీలు ఖాళీ అయ్యాయి. ఎంతో మంది తమ సొంత ఇళ్లను అమ్ముకొని ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లారు. అప్పట్లో పోలీసులు, మైత్రి సంఘాలు విశేష కృషి వల్ల నేరాలు తగ్గుముఖం పట్టాయి. ఇటీవల ఆదివారం జరిగిన దారుణహత్య మరోసారి ప్రజల్లో భయం పట్టించింది.

**పోలీసుల నిఘా తగ్గుముఖం..**

- కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని సబ్జీమండి, మేకలమండి, వందఫీట్ల జాతీయ రహదారి, ఇమామ్‌పురా శ్మశాన వాటికలు లాంటి జనసందోనం కలిగిన ప్రాంతాల్లో నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి.
- ఈ ప్రాంతాల్లో పోలీసులు కొంత మేరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది కానీ పూర్తిస్థాయిలో అజమాయిషీ లేకపోవడంతో ఈ ప్రాంతాల నుంచే నేరాలు చోటు చేసుకుంటున్నాయి.

**జియాగూడ మినీ ఇండియా..**

- జియాగూడలో సుమారు 35 బస్తీలో ఉండగా ఎక్కువ శాతం ప్రజలు ఇతర రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, కలకత్తా, బిహార్, రాజస్థాన్, గుజరాత్, ఒరిస్సా, బంగాదేశ్ తదితర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారే.
- ఇక్కడి నుంచి నగర ప్రధాన మార్కెట్లు చేరువగా ఉండడంతో చేతివృత్తులు, గంజిలల్లో పనులు, మార్కెట్లలో కూలీ పనులు చేసుకొని ఉండడానికి జియాగూడ ప్రాంతం అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుంది. దీంతో సొంత ఇళ్ల వారు అద్దెకు ఇచ్చే క్రమంలో ఎలాంటి విచారణ చేపట్టకుండా అధిక అద్దెలకు ఇస్తుంటారు.
- ఇతర రాష్ట్రాలకు చెందిన వారు నేరాలకు పాల్పడి ఇక్కడికి కూడా వస్తుంటారు. ఇక్కడ నేరాలకు పాల్పడి తమ రాష్ట్రాలకు పారిపోతారు. వీరిపై కూడా గట్టి నిఘా పూర్తి సమాచారం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**బస్తీల్లో అవుట్ పోస్టులు ఏమాయే..?**

- గతంలో జియాగూడ ఎంసీహెచ్ క్వార్టర్స్‌లో అవుట్ పోస్టు ఉండేది. అప్పట్లో ఈ కార్టర్స్‌ల్లో తరచూ జరిగే గొడవలకు చెక్ పెట్టడం జరిగింది. అలాగే సమస్యాత్మక ప్రాంతాల్లో కూడా అవుట్ పోస్టులు ఉండేవి.
- ప్రస్తుతం అవుట్‌పోస్టులు నామమాత్రంగా ఉండడంతో బస్తీల్లోని సంఘవిద్రోహుల చర్యలు కొనసాగుతున్నాయి. వీరిపై కూడా గట్టి నిఘా పెట్టి ఉక్కుపాదం మోపాలి.
- శాంతి, మైత్రి సంఘాల సమావేశాలు చేపట్టాలి. బస్తీల సంఘాలతో కలిసి పోలీసులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించినట్లైతే కానీ నేరాలు కట్టడి అవుతాయని బస్తీల వాసులు బహాటంగా తెలియజేస్తున్నారు.




మెడల్స్ అందజేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్, గోపాల్, కమల్ ప్రసాద్, బాలాజీ

## కరాటేతో స్వీయ రక్షణ

జియాగూడ: కరాటే స్వీయరక్షణకు ఉపయోగపడుతుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కృష్ణమోహన్ రావు, కేంద్ర వ్యవసాయ శాఖ ఐసీఏఆర్ డైరెక్టర్ గోపాల్, జాతీయ బీసీ దళ అధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడలోని భారత అభ్యుదయ శిక్షా సమితి గ్రౌండ్‌లో జపనీస్ స్టైల్ షోటోఖాన్ కరాటే దో అసోసియేషన్ అధ్యక్షుడు కే కమల్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మల్తుంకార్ శ్రీ బాలాజీ, ఉపాధ్యక్షుడు ఎం గురుచరణ్, సహా కార్యదర్శి నగేష్ ఆధ్వర్యంలో 8వ స్టేట్ లెవల్ కరాటే దో అసోసియేషన్ తెలంగాణ స్పోర్ట్స్ 33వ ఏఐకేఫ్ నేషనల్ కరాటే దో చాంపియన్‌షిప్–2023 పోటీలు 2 రోజుల పాటు నిర్వహించారు. ఇందులో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొనగా, 56 మంది విజేతగా నిలిచారు. వీరు జాతీయ కరాటే పోటీలకు అర్హులుగా నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓ దివ్య, నేషనల్ రిఫరి లావణ్య తదితరులు పాల్గొనగా, జియాగూడ విద్యాశ్రీ హై స్కూల్, సరస్వతీ విద్యా నికేతన్ స్కూల్, కృష్ణవేణి హైస్కూల్, అబిడ్స్ డైమండ్ జూబ్లీ స్కూల్‌లకు చెందిన కరాటే క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లను బహూకరించారు.

## సరస్వతి పూజల్లో తహసీల్దార్ ఫర్హీన్ షేక్



సరస్వతీ దేవి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న తహసీల్దార్ షేక్ ఫర్హీన్

చార్మినార్: ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ ఫర్హీన్ షేక్ మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర ఆలయంలో జరిగిన సరస్వతీ దేవి పూజా కార్యక్రమాల్లో విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. సరస్వతీ దేవి విగ్రహానికి జరుగుతున్న పూజా కార్యక్రమానికి ఆమె హాజరైన ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు మీరాలంమండి ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో బెంగాలీ మహిళ భక్తులు పూలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలందరూ దేవుని ముందు సమానమేనని.. కుల మతాలకు అతీతంగా కలిసి మెలిసి ఉంటూ దేశాభివృద్ధికి పాటు పడాలన్నారు. మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర ఆలయం పాతబస్తీలోనే అతి విశాలంగా సౌకర్యవంతంగా ఉందన్నారు. భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ రాకేశ్ తివారీ, అన్నారావు కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సాధికారతకు కృషి



భవనాన్ని ప్రారంభిస్తున్న భవనం దాత కమల్ నారాయణ జి.రాఠి, లీలావతి రాఠి

సుల్తాన్‌బజార్: దివ్యాంగుల సాధికారతకు కృషి చేస్తున్నామని నారాయణ సేవా సంస్థాన్ అధ్యక్షుడు ప్రశాంత్ అగర్వాల్ అన్నారు. ఇసామియాబజార్‌లో సేవా కేంద్రం (లీలావతి మానవ భవన్)ను భవనం దాత కమల్ నారాయణ జి.రాఠి, లీలావతి రాఠి ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రశాంత్ అగర్వాల్ మాట్లాడుతూ.. దేశంలోని దివ్యాంగులకు మనోధైర్యాన్నిస్తూ మూడు దశాబ్దాలుగా అనగారిన దివ్యాంగులకు పునరావాసం, కృత్రిమ అవయవాలను అందిస్తున్నామన్నారు. దివ్యాంగుల జీవనోపాధికి మొబైల్ రిపేరింగ్, కంప్యూటర్ టైలరింగ్ వివిధ రకాల శిక్షణ ఇస్తూ వారికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. ఫిజియోథెరపీ లాంటి చికిత్సలు అందిస్తూ వారికి అండగా ఉంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు అల్కాచౌదరి, జస్మత్ పటేల్, సురేందర్ మాల్ లునియా, ఉత్తమ్ జైన్‌దామాని, హైదరాబాద్ లైబ్రరీ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్, ఆర్‌కె.జైన్, రితీష్ జాగిర్దార్, మహేందర్ సింగ్ రావత్ పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



వేణుగోపాలాచారిని సత్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన సముద్రాల వేణుగోపాలాచారికి తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ సత్కార సభ ఆదివారం నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా సముద్రాల వేణుగోపాలాచారిని ఘనంగా సత్కరించి ప్రసంగించారు. బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నట్లు వివరించారు. సముద్రాల వేణుగోపాలాచారి పీవీ నర్సింహారావు తర్వాత కేంద్ర మంత్రిగా బ్రాహ్మణ సమాజం నుంచి పనిచేయడం బ్రాహ్మణులందరికీ గర్వకారణమని తెలిపారు. రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న సముద్రాల వేణుగోపాలాచారికి తెలంగాణ నీటి పారుదల అభివృద్ధి కార్పొరేషన్‌కు చైర్మన్‌గా సీఎం కేసీఆర్ నియమించడం పట్ల బ్రాహ్మణ సమాజం హర్షించాలని సూచించారు. సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. బ్రాహ్మణులు సంఘటితంగా ఉంటూ భవిష్యత్తులో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు పథకాల పట్ల అవగాహన పెంచుకుని సరైన పత్రాలతో దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. ఏ కార్పొరేషన్‌కు కేటాయించని నిధులు బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తుకు రూ.250 కోట్లను అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మా ఈఎన్‌టీ దవాఖానా చైర్మన్ సునితాకుమార్, పారిశ్రామిక వేత్త చకిలం సుధాకర్, సంగీత దర్శకులు కొమాండూరి రామాచారి, బ్రాహ్మణ సంఘాల సభ్యులు వెన్నంపల్లి జగన్ మోహన్ శర్మ, గాడిచర్ల నాగేశ్వర సిద్ధాంతి, హనుమంతాచారి, ఎస్‌టీ.చారి, జొన్నల గడ్డ సూర్యకాంతం, తులసి శ్రీనివాస్, మునిపల్లె శ్రీనివాస్, నరేంద్రచారి, బండారు రాంప్రసాద్ పాల్గొన్నారు.

### గోల్కొండ కోటను సందర్శించిన జీ-20 ప్రతినిధి బృందం

గోల్కొండ: నగరానికి వచ్చిన జీ–20 ప్రతినిధుల బృందం ఆదివారం సాయంత్రం గోల్కొండ కోటను సందర్శించింది. సాయంత్రం 6 గంటలకు ప్రతినిధులు ప్రత్యేక బస్సులలో గోల్కొండ కోటకు రాగానే గోల్కొండ కోట అధికారులు వారికి స్వాగతం పలికారు. అయితే బృందం నేరుగా గోల్కొండ క్లాపింగ్ పోర్టికోను చూసింది. అనంతరం నేరుగా నగినాబాగ్ గుండా రాణిమహల్‌కు చేరుకున్నారు. అక్కడ కోటలో ప్రదర్శించే లైట్ అండ్ సౌండ్ షోను తిలకించారు. ఈ ప్రతినిధి బృందంలో 130 మంది ఉన్నారు.

### బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

గౌలిపురా: మొగుల్‌పురా చెందిన బీజేపీ కార్యకర్తలు పలువురు ఆదివారం హోంమంత్రి మహమూద్ అలీ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీజేపీ ఎస్సీ సెల్ హైదరాబాద్ పార్లమెంటరీ మాజీ ఇన్‌చార్జి గడ్డం సత్యనారాయణతో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాయకులు హోంమంత్రి సమక్షంలో పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేశంలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టారన్నారు. ఎనిమిదేళ్ల పాలనలో ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి తెలంగాణ ప్రజలకు సేవ చేశారన్నారు.

### చిన్నారి అదృశ్యం



మెహక్ ఫాతీమా

చాంద్రాయణగుట్ట: నాలుగేళ్ల చిన్నారి అదృశ్యమైన ఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఇస్మాయిల్‌నగర్‌కు చెందిన షేక్ అజీజ్‌కు ఇద్దరు కుమార్తెలు. ఈనెల 27న ఉదయం అతని భార్య ఆస్పత్రికి వెళ్లగా అతను డ్యూటీకి వెళ్లే క్రమంలో తన ఇద్దరు కుమార్తెలు ఆయేషా ఫాతీమా, మెహక్ ఫాతీమా(4)లను సమీపంలోని తన సోదరీ ఇంట్లో ఉంచాడు. సాయంత్రం వేళ మెహక్ ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. ఈ విషయమై అతని సోదరీ ద్వారా సమాచారం అందుకున్న అజీజ్ చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చిన్నారి ఆచూకీ తెలిసిన వారు చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో గాని, 87126 60390లో సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

### పాతబస్తీలో పర్యాటకుల సందడి



చార్మినార్: పాత బస్తీలోని పర్యాటక ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో సందడిగా కనిపించాయి. చార్మినార్ కట్టడంతో పాటు హెచ్‌ఈహెచ్ నిజాం మ్యూజియం, సాలార్ జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్, మక్కా మసీదు, లాడ్‌బజార్ తదితర పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో కిటకిటలాడాయి. సందర్శకుల సంఖ్య పెరగడంతో స్థానికంగా చిరు వ్యాపారాలు కూడా జోరుగా కొనసాగాయి. వాహనాల రాకపోకలు పెరగడంతో గుల్జార్ హౌస్, చార్‌కమాన్, పత్తర్‌గట్టి, మదీనా, నయాపూల్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ తిప్పలు తప్ప లేదు.

### నుమాయిష్‌లో ఆధార్ సేవలు

అబిడ్స్: నుమాయిష్ ఎగ్జిబిషన్‌లో ఆధార్ సేవలు ప్రారంభించారు. జనవరి 31వ తేదీ వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ ఆధార్ క్యాంపును నిర్వహిస్తున్నారు. కొత్త ఆధార్ నమోదు కోసం ఈ శిబిరాన్ని ఉపయోగించుకోవచ్చు. 5–15 ఏళ్ల వయస్సులో పిల్లలకు బయోమెట్రిక్‌లను ఉచితంగా అప్‌డేట్ చేయవచ్చు. ఈ శిబిరంలో వారి చిరునామా, మొబైల్ నంబర్, ఈమెయిల్‌లను అప్‌డేట్ చేయవచ్చు.



## నీలి కుల సంఘ భవనానికి నిధులు కేటాయించాలి



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లికార్జున్ తదితరులు

గోల్కొండ: నీలి కుల ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి కోటి రూపాయాలు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర నీలి కుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు మల్లికార్జున్ అడ్కి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. 2018లో భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల కేటాయించిందన్నారు. నిర్మాణ వ్యయం పెరిగిందని, ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆత్మ గౌరవ భవనంలో కార్యాలయంతో పాటు వసతి గృహం కూడా నిర్మిస్తే నీలి కుల విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయం సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి కోటి రూపాయాలు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జి.వీరన్న, రమేష్, సి.శ్రీహరి రావు, ఎ.చంద్రశేఖర్‌రావు తదితరులు ఉన్నారు.

## జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం



జీవన సాఫల్య పురస్కారాలను అందజేస్తున్న ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్

చార్మినార్: భక్తి సాహిత్య సాంస్కృతిక పరిశోధన కేంద్రం, తులసి భవన్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో కాలేజీ అధ్యాపకులు, నిష్ణాతులైన కళాకారులకు జీవన సాఫల్య పురస్కారంతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య గణేష్, విశేష అతిథులుగా బేగంపేట్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మావతి, ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ హాజరై పురస్కార ప్రదానం చేశారు. అధ్యాపకులు డాక్టర్ నీలిమా దేవి, డాక్టర్ సంగీత, కె.డాక్టర్ రాజ్యశ్రీ, పి.మోరే, డాక్టర్ వందన, డాక్టర్ సుష్మాదేవి, డాక్టర్ నర్మదా పటేల్, డాక్టర్ జె.సరిత, డాక్టర్ శ్యాంసుందర్ పురస్కారాలు అందుకున్నారు. కళాకారులు డాక్టర్ రత్నశ్రీ, బి.రాధా, డాక్టర్ వి.కె.దుర్గా, డాక్టర్ పద్మప్రియ, జంగయ్య గౌడ్, డాక్టర్ కె.వెంకటాచారి, అశోక్ కుమార్, సలీం, గణేష్ తదితర కళాకారులు పురస్కారాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తులసి భవన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయ కళలను పరిరక్షించుకుందాం



సినీనటి శైలజకు పురస్కారాన్ని అందజేస్తున్న దామోధర్‌గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: సంప్రదాయ కళలు, పండగలు తెలుగువారికి ప్రత్యేక గుర్తింపును ఇస్తాయని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోధర్‌గుప్తా అన్నారు. వీటిని పరిరక్షించుకుంటూ ముందు తరాలకు అందించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో భారత ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల పేరిట సంగీత నృత్య కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన పలువురు కళాకారుల శాస్త్రీయ నృత్యాలు, లలిత గీతాగానం ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం పలువురు నాట్య గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సినీ నటి శైలజ, బోనాల ప్రతినిధి శ్యామల దేవి, భారత ఆర్ట్స్ కాడామి వ్యవస్థాపకుడు లయన్ కేవీ.రమణారావు, ఏబీసీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు లలిత తదితరులు పాల్గొన్నారు.

## నిలోఫర్ ఆస్పత్రిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ సభ్యులు

నాంపల్లి: రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు ఉచితంగా అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెద్ది శంకర్‌గౌడ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో రోగులు, రోగి సహాయకులు సుమారు 500 మందికి పైగా హాజరై సద్వినియోగం చేసుకున్నారు. బీఆర్‌ఎస్ యువ నేత మత్తరాజుయాదవ్, హరే రామ, హరే కృష్ణ మందిరం ప్రతినిధి రాధా మనోహర్ దాస్ అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధా మనోహర్ దాస్ మాట్లాడుతూ.. అన్నం పెట్టే వారికి దండం పెట్టాలని కోరారు. ఆకలితో ఉన్న నిరుపేద రోగులు, రోగి సహాకులకు అండగా నిలబడటం పట్ల రెడీ టూ సర్వ్ సంస్థ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సమస్త కో ఆర్డినేటర్స్ ప్రకాష్, చైతన్య, పీఆర్‌ఓ లక్ష్మణ్, సభ్యులు నవీన్, రాజు, శ్రీను, రామయ్య ప్రశాంత్ పాల్గొన్నారు.

## ఉద్యోగులకు అండగా టీఎన్జీఓ సంఘం



డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేనిని సత్కరించిన సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగుల సంఘం నాయకులు

అబిడ్స్: ఉద్యోగులకు అన్నివిధాలా తమ యూనియన్ అండగా ఉండి వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తుందని హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓ అధ్యక్షుడు, సేవారత్న డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ హైదరాబాద్ జిల్లా యూనిట్ తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీ సాయికాంత్‌తో పాటు ఇతర సభ్యులంతా డాక్టర్ ముజీబ్ హుసేనీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు అండగా ఉండి వారి సమస్యలను ప్రభుత్వం ద్వారా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజేషం, రాజేందర్‌కుమార్, అనిత, వీణా కుమారి, రాధా, కిరణ్‌కుమార్, జలజ, బాల్‌రాజ్, విజయ్‌కుమార్, రాజ్‌కిరణ్, లక్ష్మీ, ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మాన్‌గంజ్ సమస్యల పరిష్కారానికి కృషి



బైండ్ల శివకుమార్‌ను సన్మానిస్తున్న వ్యాపారులు

అఫ్జల్‌గంజ్: ఉస్మాన్‌గంజ్ మార్కెట్ స్మార్ట్ రిటైల్ ఫుడ్, స్టఫ్ వ్యాపారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మరోసారి నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు బైండ్ల శివకుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఉస్మాన్‌గంజ్‌లో గల కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వరుసగా నాలుగోసారి అధ్యక్షుడిగా గెలుపొందిన ఆయనను గంజ్ వ్యాపారులు ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజ్‌లో ఉన్న నాలా సమస్యలతో పాటు సంఘ సభ్యుల సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.

### కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ లాల్‌సింగ్, ముక్కా కృష్ణగుప్తా తదితరులు

అబిడ్స్: శ్రీ తుల్జాభవాని సమాజ్ నూతన 2023 కేలండర్‌ను ఆవిష్కరించారు. గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్, బీజేపీ కిసాన్‌మోర్చా గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కా కృష్ణగుప్తా, అధికార ప్రతినిధి శశికాంత్ కులకర్ణి ఆవిష్కరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ శర్మ, లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.